సాక్షి
కుమురం భీం

సోమవారం ; 3 ; ఫిబ్రవరి ; 2025

'ఎమ్మెల్సీ'కి నామినేషన్లు!

కరీంనగర్ – మెదక్– నిజామాబాద్ – ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ నామినేషన్లకు రంగం సిద్ధమైంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

- 8లో▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /18.4

చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.

చిరుతపులి సంచారం

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ సూచించారు. తిర్యాణి అటవీ సెక్షన్ పరిధిలో ఆదివారం చిరుత పులి పాదముద్రలు గుర్తించామని తెలిపారు. చింతపల్లి, నాయకపుగూడ, ఇర్కపల్లి గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి అప్రమత్తం చేశామన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలెవ్వరూ అటవీ ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించారు. చిరుత పులి, దాని ఆనవాళ్లు కనిపిస్తే పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

8న ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: 9వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లు, ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 8న పరీక్ష నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశ కోసం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు, ఇంటర్ ప్రవేశాల కోసం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని వెల్లడించారు. విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.


జాతీయస్థాయికి ఎంపిక కావడం అభినందనీయం



విద్యార్థులను సన్మానిస్తున్న అలీబిన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం క్రీడాకారులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 12 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయస్థాయి 38వ సీనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన కీర్తన, దీప్తి, వెంకటేశ్ తెలంగాణ జట్టు తరఫున ఆడతారని తెలిపారు. క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించాలన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ జిల్లా కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీశైలం!



దోని శ్రీశైలం

చింతలమానెపల్లి(సిర్పూర్): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దోని శ్రీశైలం నియామకం కానున్నారని సమాచారం. చింతలమానెపల్లి మండలం డబ్బా పంచాయితీ పరిధిలోని దరంపెల్లి గ్రామానికి చెందిన దోని శ్రీశైలం బీజేపీలో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ చురుగ్గా పనిచేశారు. గత శాసనసభ ఎన్నికల అనంతరం 2018లో బీజేపీలో చేరి చింతలమానెపల్లి మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2021లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన దోని శ్రీశైలం ఎంపిక చేయడం ద్వారా బీసీలకు ప్రాధాన్యత కొనసాగిస్తున్నామని పార్టీ సూచనలిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం పార్టీ అధిష్టానం నూతన అధ్యక్షులను అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం.

శిక్షణ ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షభూమిలో సెంటర్ కమిటీ, దీక్షాభూమి, జైభీం సేన ఆధ్వర్యంలో గ్రామినేర్ ప్రెక్షిప్ శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ముందుగా బంతే ధమ్మసార్ అమరావతి, భరద్వాజ్ ముంబై జ్యోతి ప్రజ్వలన చేసి గౌతమి బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రతిరోజూ ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు పదిరోజులపాటు ఈ శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కమిటీ అధ్యక్షుడు దుర్గం హుక్షు, గౌరవ అధ్యక్షుడు జాడి కృష్ణాజీ, ఉపాసక్ దుర్గం యశ్వంత్‌రావు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలిసారి నిఘా!



ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్

- నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు
- జిల్లాలో 23 కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 3,450 మంది విద్యార్థులు
- మొదటిసారి సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఎంపిక జూనియర్ కళాశాలల్లో సోమవారం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు మొదటిసారి సీసీ కెమెరాల నిఘాలో ప్రయోగ పరీక్షలు నిర్వహించనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బోర్డు నిబంధనల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, అవకతవకలకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీఐఈవో కళ్యాణి వెల్లడించారు.

23 పరీక్ష కేంద్రాలు..

జిల్లాలో మొత్తం 48 జూనియర్ కళాశాలలు ఉండగా, ఇందులో 11 ప్రభుత్వ కళాశాలు, 37 ప్రైవేట్, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 9,463 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,176 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,287 మంది ఉన్నారు. ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షల కోసం 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా, కేవలం నాలుగు మాత్రమే ప్రైవేట్ కాలేజీల్లో ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్స్ పరీక్షలు 22వ తేదీ వరకు విడతలవారీగా కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో షిఫ్ట్‌లో పరీక్షలు ఉంటాయి. మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 3 నుంచి మొదటి దఫా పరీక్షలు నిర్వహిస్తుండగా, ఫిబ్రవరి 8 నుంచి 12 వరకు రెండో దఫా, 13వ తేదీ నుంచి 22 వరకు మూడో దఫా పరీక్షలు జరుగనున్నాయి. రెగ్యులర్ విద్యార్థులు 1,920 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,530 మంది హాజరుకానున్నారు.

పకడ్బందీగా నిఘా..

ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలపై ఏళ్లుగా ఆరోపణలు ఉన్నాయి. సెల్ఫ్ సెంటర్లు కలిగిన ప్రైవేట్ కాలేజీలు ర్యాంకులే లక్ష్యంగా అవకతవకలకు పాల్పడుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ కళాశాల విద్యార్థులతో పోలిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు వెనుకబడిపోతున్నారని వారు చెబుతున్నారు. సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్స్ నిర్వహించాలనే డిమాండ్ చాలాకాలంగా వినిపిస్తోంది. దీంతో ఇంటర్మీడియెట్ బోర్డు ఈ ఏడాది నుంచి నిఘా నీడలో ప్రాక్టికల్స్ నిర్వహించాలని నిర్ణయించింది. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల నుంచి కాస్త వ్యతిరేకత వచ్చింది. సీసీ కెమెరాల నిర్వహణ భారం తమపై మోపవద్దని యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. అయినా ఇంటర్ బోర్డు మాత్రం వెనుకడుగు వేయలేదు. అన్నికేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయోగ పరీక్షలు జరిగే ప్రతీ ల్యాబ్‌లో నాలుగు మెగా పిక్సెల్ కలిగిన రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాలు వాయిస్ రికార్డింగ్, వీడియో రికార్డింగ్ సౌకర్యం కలిగి ఉంటాయి. ప్రయోగ పరీక్ష కేంద్రం నుంచి నేరుగా కమిషనర్ కార్యాలయానికి అనుసంధానమై ఉంటాయి. ఇప్పటికే వార్షిక పరీక్షల టైం టేబుల్ కూడా ప్రకటించారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

ఆందోళన వద్దు



ప్రాక్టికల్స్ పరీక్షలపై విద్యార్థులు భయాందోళనకు గురికావొద్దు. వైవాలో అడిగే ప్రశ్నలకు నిర్భయంగా సమాధానం చెప్పాలి. రసాయన శాస్త్రంలో ముఖ్యంగా ఘన పరిణాత్మక, లవణ విశ్లేషణపై దృష్టి సారించాలి. లవణ విశ్లేషణలో ఆనయాన్ నిర్ధారణ పరీక్షలో తప్పకుండా రెండు నిర్ధారణ పరీక్షలు చేయాలి. రికార్డులు కూడా అందుబాటులో ఉంచుకోవాలి.

– సంతోష్, రసాయనశాస్త్ర అధ్యాపకుడు, ఆసిఫాబాద్ ప్రభుత్వ కళాశాల

నిర్భయంగా పరీక్షలు రాయాలి



వైవా, థియరీ ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తే వార్షిక పరీక్షలకు కూడా ఎక్కువగా ఉపయోగకరంగా ఉంటుంది. నిర్భయంగా పరీక్షలు రాయాలి. ఫిజిక్స్‌లో భయం లేకుండా ఫార్ములా పద్ధతి, సూత్రాలపై దృష్టి సారిస్తే సులువుగా ఉత్తీర్ణత సాధించవచ్చు. 30 మార్కులకు కనీసం 11 వస్తే సాధిస్తే ఉత్తీర్ణత సాధించినట్లే..

– మహేశ్, భౌతికశాస్త్ర అధ్యాపకుడు, ఆసిఫాబాద్ మోడల్ స్కూల్

ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్నిఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటర్మీడియెట్ బోర్డు నిర్ణయం మేరకు సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలు నిర్వహిస్తాం. 23 పరీక్ష కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి.

– కళ్యాణి, డీఐఈవో

'వసంత' వైభవం



ఆలయంలో క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

- రెండోరోజూ కొనసాగిన వేడుకలు
- ఆలయంలో పటిష్ట బందోబస్తు
- ఇబ్బంది పడ్డ సామాన్య భక్తులు

భైంసా/బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు కొనసాగుతున్నాయి. రెండోరోజైన ఆదివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. వేకువజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే అక్షరాభ్యాస టికెట్, లడ్డూ కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరి కనిపించారు.

కాలినడకన వేలాది మంది..

ఏటా వసంత పంచమి పర్వదినాన నిర్మల్, నిజామాబాద్‌తోపాటు మహారాష్ట్ర నుంచి వేలాదిమంది భక్తులు బాసరకు పాదయాత్రగా వస్తుంటారు. ఇలా సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన బాసరకు వచ్చిన భక్తులు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. పాదయాత్రగా వచ్చిన భక్తులను నేరుగా దర్శనానికి పంపాలని నాలుగేళ్లుగా వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. అలాగే సామాన్య భక్తులూ ఇబ్బందులు పడ్డారు. ఆలయ ప్రాంగణంలో నిరీక్షించేందుకు ప్రత్యేక స్థలం కేటాయించలేదు. ఇక అన్నదాన సత్రాల వద్ద ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో గంటలతరబడి నిల్చున్న భక్తులకు తాగునీరు, పాలు అందించలేదు.

ఎటు చూసినా భక్తజనమే..

బాసర గోదావరి నది తీరంలో ఎటు చూసినా భక్తులే కనిపించారు. ముందుగా స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలాచరించారు. గంగమ్మతల్లికి పూజలు చేశారు. సూర్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న తర్వాత కాళీమాత ఆలయంలోనూ పూజలు చేశారు. వ్యాసగుహ వద్ద భక్తుల సందడి కనిపించింది. దుకాణాలు సందడిగా మారాయి. చాలామంది యాత్రికులు కుటుంబ సభ్యులతో గోదావరి నదిలో బోటింగ్ చేశారు.

నేడు మరింత రద్దీ..

ఏటా సరస్వతీ అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ ఏడాది కూడా వసంత పంచమి వేడుకల్లో పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. వసంత పంచమి వేడుకల్లో మూడో రోజైన సోమవారం భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశముంది. అధికారులు స్పందించి భక్తుల సంఖ్యకు తగినట్లు ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

భారీ సంఖ్యలో వాహనాలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వాహనాల్లో తరలివచ్చారు. వాహనాలన్నీ పార్కింగ్ స్థలంలో నిలిపి కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచి వాహనాల తాకిడి మరింత పెరిగింది. రైలు మార్గం ద్వారా వచ్చిన భక్తులు అర్ధరాత్రి బాసరకు చేరుకున్నారు. మరోవైపు బస్సుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు వస్తూనే ఉన్నారు. వసంత పంచమి శుభఘడియల్లో పిల్లలకు అక్షర శ్రీకార పూజలు చేయించేందుకు ఆసక్తి చూపారు. సినీ నిర్మాత దిల్‌రాజు కుటుంబ సమేతంగా బాసరకు చేరుకున్నారు. తన కుమారుడికి అక్షరాభ్యాస పూజలు జరిపించారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు.



అక్షరాభ్యాస మండపంలో భక్తులు

పటిష్ట పోలీస్ బందోబస్తు

నిర్మల్‌టౌన్: బాసరలో నిర్వహిస్తున్న వసంత పంచమి ఉత్సవాల కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఎస్పీలు ఉపేంద్రారెడ్డి, అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనాతోపాటు 10 మంది సీఐలు, 22మంది ఎస్సైలు, ముగ్గురు మహిళా ఎస్సైలు, 15మంది ఏఎస్సైలు, 200 మంది సిబ్బంది, 50 మంది మహిళా సిబ్బంది, 64 మంది హోంగార్డులు బందోబస్తు విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. స్నానఘట్టాల వద్ద, గోదావరి నది తీరం, ప్రసాదాల కౌంటర్ల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'కేంద్ర బడ్జెట్‌లో కార్మికులకు మొండిచేయి'

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర బడ్జెట్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక కర్షక వర్గాలు, తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ విమర్శించారు. మండలంలోని గోలేటిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి రూ.63వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. 200 పనిదినాలకు పెంచుతూ, రోజువారీ కూలి రూ.600 చెల్లించాలని దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా పేదలు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పంటల మద్దతు ధర, సింగరేణి కార్మికులకు ఐటీ రద్దు అంశాలపై పట్టింపు లేదన్నారు. కార్పొరేట్ల మేలు కోసమే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించలేదని, తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించలేదన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సాగర్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జాడిసాయి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపేందర్

బర్డ్‌వాక్‌కు స్పందన



బొక్కివాగు ప్రాజెక్టు వద్ద ఔత్సాహికులతో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ రేంజ్‌లో నిర్వహించిన బర్డ్‌వాక్ కార్యక్రమానికి పక్షి ప్రేమికుల నుంచి స్పందన వచ్చిందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. ఎల్లూర్ బొక్కివాగు ప్రాజెక్టు వద్ద ఆదివారం బర్డ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయమే చెరువు వద్దకు చేరుకున్న ఆయన పర్యాటకులతో కలిసి పక్షుల ఫొటోలను కెమెరాలో బంధించారు. అనంతరం రేంజ్ పరిధిలోని పెద్దవాగు, ప్రాణహిత, చెరువులు, కుంటతోపాటు పాలరాపు గుట్ట వద్ద రాబంధుల స్థావరాన్ని సందర్శించారు. గుండెపల్లి అటవీ ప్రాంతంలో సఫారీ వాహనంలో అడవి అందాలను తిలకించారు. పెద్దవాగు, ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో విహరిస్తున్న పక్షులను చూసి ముగ్ధులయ్యారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఔత్సాహికులకు శనివారం రాత్రి ఫైర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్, ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పాలరాపు గుట్ట వద్ద పక్షి ప్రేమికులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని డ్యాం, దరిగాం అటవీ ప్రాంతాల్లో ఆదివారం బర్డ్‌వాక్ ఫెస్టివల్ నిర్వహించారు. ప్రకృతి ప్రేమికులతో పాటు జిల్లా ఫారెస్టు అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ అధికారి సుశాంత్ సుఖదేవ్, తదితరులు అటవీ ప్రాంతంలోని ప్రకృతి అందాలను వీక్షించారు.

బెబ్బులితోనే సహవాసం!

- జిల్లావ్యాప్తంగా పెరిగిన పెద్దపులుల ఉనికి
- గ్రామీణ ప్రాంతాలకు సమీపంలోనే సంచారం
- సంరక్షణకు అటవీశాఖ చర్యలు



చింతలమానెపల్లి(సిర్పూర్): పెద్దపులి అడవికి గుర్తింపు.. విస్తారమైన అటవీ సంపద కలిగి ఉన్న కాగజ్‌నగర్ డివిజన్ బెబ్బులి జీవనానికి అనువుగా మారుతోంది. ఇందుకు అనుగుణంగా ఇక్కడ పులి సంచారం కూడా గతంలో పోలిస్తే గణనీయంగా పెరిగింది. స్థానిక ప్రజలు పెద్దపులితో ఇక సహవాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో వన్యప్రాణులు, ప్రజల మధ్య ఘర్షణ తగ్గించేందుకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. పెద్దపులుల జీవనానికి ఆటంకాలు ఏర్పడకుండా తగిన ఏర్పాట్లు చేస్తోంది.

విస్తారమైన అటవీప్రాంతం

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్లు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లోని ఐదు రేంజ్‌ల పరిధిలో 917 చదరపు కిలోమీటర్లు, ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఐదు రేంజ్‌ల పరిధిలో 1,518 చదరపు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం విస్తరించింది. జిల్లాలో మొత్తం 2,437 చదరపు కిలోమీటర్ల వరకు అటవీప్రాంతం ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో 115, ఆసిఫాబాద్ డివిజన్‌లో 55 చదరపు కిలోమీటర్ల మేర దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. అటవీ సాంద్రత ప్రకారం జిల్లాలో 890 చదరపు కిలోమీటర్ల సాధారణ అడవి ఉంది. ప్రాణహిత, పెన్‌గంగ, వైన్‌గంగ నదులు, బీబ్రా నది(పెద్దవాగు) సహా మరికొన్ని ముఖ్యమైన వాగులు అటవీ ప్రాంతం నుంచే ప్రవహిస్తున్నాయి. సరిహద్దుగా ఉన్న మహారాష్ట్రలో తాడోబా పులుల అభయారణ్యం, భామ్రాగఢ్, తిప్పేశ్వర్ అభయారణ్యాలతోపాటు మరోవైపు కవ్వాల్ పులుల అభయారణ్యం ఉంది.

పులుల సంరక్షణకు చర్యలు

2024లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు కొనసాగింపుగా కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు ప్రతిపాదనకు రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు ఆమోదం తెలిపింది. అదే ఏడాది పులులు ప్రజలపై దాడులకు పాల్పడడంతో ఇప్పటికే ఉన్న కారిడార్‌లో మరిన్ని చర్యలు తీసుకునే దిశగా అటవీశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా సుమారు 1500 చదరపు కిలోమీటర్ల పరిధిలో పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా చర్యలు చేపట్టనున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో ఇప్పటికే ఉన్న వన్యప్రాణుల ట్రాకర్లకు అదనంగా నియమించారు. దీర్ఘకాలికంగా ట్రాకర్లు, ఇతర సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించారు. పులుల సంచారం నమోదు కాని ప్రాంతాల్లోనూ కెమెరాలు అమరుస్తున్నారు. అటవీ ప్రభావిత గ్రామాలు, సమీప ప్రాంతాల్లో అవగాహన నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌ను పులుల రక్షిత అభయారణ్యంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అభ్యంతరాలు.. సమస్యలు

అయితే 2022లో దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లో పులిదాడిలో ఇద్దరు మృతి చెందారు. 2024లో ఇద్దరిపై దాడి చేయగా, ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో పెద్దపులులు, వన్యప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలు పూర్తిస్థాయిలో సఫలం కావాలంటే శాఖపరంగా మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. నిబంధనలు అమలు చేయాలంటే ప్రజాభిప్రాయమే కీలకమని అధికారులే పేర్కొంటున్నారు. గతంలో ఇక్కడ పులులను హతమార్చిన ఘటనలు ఉన్నాయి. అలాగే కోర్‌జోన్, బఫర్ జోన్ నుంచి పులులు గ్రామాల సమీపంలోకి వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. బెబ్బులి దాడులు పెరిగే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది. అడవి పందులు, ఇతర వన్యప్రాణుల కారణంగా పెంపుడు జంతువులు, పంటలు నష్టపోతే పరిహారం చెల్లించడం లేదు. చింతలమానెపల్లి మండలంలోని ఖర్జెల్లి, గంగాపూర్ గ్రామాల శివార్లలో అడవిపందుల దాడిలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నా పరిహారం చెల్లించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వన్యప్రాణులు అడవుల నుంచి బయటకు రాకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆదివాసీలు, కొన్ని వర్గాల ప్రజలు అడవులే ఆధారంగా నివసిస్తున్నారు. ఇప్పపూల సేకరణ, పాడి జంతువులను మేతకు తీసుకెళ్లడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరంతా పులుల సంచారంతో ఇబ్బంది పడే అవకాశం ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించకుంటే వీరికి జీవనం కష్టంగా మారుతుంది.

పులులకు ఆవాసంగా..

కవ్వాల్ పులుల రక్షిత అభయారణ్యం ఏర్పాటు తర్వాత జిల్లా అటవీప్రాంతం మహారాష్ట్రలోని పులుల అభయారణ్యాలకు కారిడార్‌గా మారింది. పులుల రాకపోకలకు అనువుగా ఉంది. దీంతో కాగజ్‌నగర్ డివిజన్‌లో అటవీ శాఖ పులుల ఉనికిని గుర్తించేందుకు కెమెరాలు ఏర్పాటు చేసి ట్రాకర్లను నియమించింది. పులులు దరిగాం, అంకుసాపూర్, కడంబా అటవీ ప్రాంతంలో శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. కవ్వాల్, తాడోబా పులుల అభయారణ్యాలకు కారిడార్‌గా ఉండాల్సిన అటవీ ప్రాంతం స్థిరఆవాసంగా మారింది. కడంబా అటవీ ప్రాంతంలో పులులు పిల్లలతో ఉన్న ఫొటోలను అటవీశాఖ గతంలో విడుదల చేసింది. స్థానికంగా సుమారు ఏడు పులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాయని, మరి కొన్ని తాడోబా నుంచి రాకపోకలు సాగిస్తున్నాయని అంచనా వేస్తున్నారు.

ప్రజలకు అవగాహన

అటవీ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు వన్యప్రాణులు, అడవుల రక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. పులుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అటవీశాఖ, ప్రభుత్వం వ్యవహరిస్తుంది. వారి భాగస్వామ్యంతోనే అడవుల అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించాం.

– సుశాంత్ సుఖ్‌దేవ్ బొబాడె, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

క్లుప్తంగా

నాగోబా జాతరకు వెళ్లివస్తూ ఒకరు మృతి

ఇచ్చోడ: ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన మడావి రాజు(30) తన స్నేహితుడు తులసీరాంతో కలిసి శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నాగోబా జాతరకు వెళ్లి వస్తుండగా 44వ జాతీయ రహదారిపై దూబార్‌పేట్ వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తూ సడన్‌గా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాజు మృతి చెందాడు. మృతుని సోదరి శకుంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: కులం పేరుతో దూషించిన సామల ప్రశాంత్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని మోచిగల్లికి చెందిన యువజన సంఘాల అధ్యక్షుడు బాలశంకర్ బాధితుడు కృష్ణను కులం పేరుతో దూషించడంతో పాటు సెల్‌ఫోన్‌లో అసభ్యకర మెస్సేజ్‌లు పెట్టినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బొలెరో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ మండలం వేలాల గ్రామానికి చెందిన సంతోశ్ ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలకు వస్తుండగా మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఘటనలో సంతోశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు


108లో ఆస్పత్రికి వెళ్తున్న క్షతగాత్రులు

ఇంద్రవెల్లి: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, 108 పైలెట్ ఆత్రం అశోక్, ఈఎంటీ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలంలోని ఓడిని గ్రామానికి చెందిన సురాజ్, తేజష్, విక్రం శనివారం రాత్రి కేస్లాపూర్ నాగోబా జాతరకు వెళ్లి వస్తుండగా ముత్నూర్, కేస్లాపూర్ గ్రామాల మధ్య గుడిహత్నూర్ మండలంలోని మర్కగూడకు చెందిన ఆటో ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. తేజష్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

‘ఎమ్మెల్సీ’కి నామినేషన్లు!

- సిద్ధమవుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రులు
- 7న నామినేషన్ వేయనున్న నరేందర్‌రెడ్డి
- తొలిరోజు నామినేషన్లకు రవీందర్‌సింగ్ సన్నాహాలు
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని బీఆర్ఎస్
- గ్రాడ్యుయేట్ గులాబీ ఎమ్మెల్సీగా ప్రసన్న హరికృష్ణ?

షెడ్యూల్ ఇలా..!

1. నోటిఫికేషన్ విడుదల	03-02-2025
2. నామినేషన్ల చివరితేదీ	10-02-2025
3. నామినేషన్ల స్క్రూటినీ	11-02-2025
4. విత్‌డ్రాలకు చివరితేదీ	13-02-2025
5. పోలింగ్ తేదీ	27-02-2025
6. ఓట్ల లెక్కింపు	03-03-2025
7. ఎన్నికల ప్రక్రియపూర్తి	08-03-2025


కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ – మెదక్–నిజామాబాద్ – ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ నామినేషన్లకు రంగం సిద్ధమైంది. కరీంనగర్ కేంద్రంగా జరిగే జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కలెక్టర్ పమేలా సత్పతి ఆర్వోగా వ్యవహరిస్తారు. నేడు ఈ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడనుంది. నేటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం 11వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 13గా నిర్ణయించారు. 27వ తేదీన పోలింగ్ జరగనుంది. మార్చి 03న ఓట్ల లెక్కింపు జరగనుంది. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. 15 జిల్లాలు, 42 నియోజకవర్గాలు ఎన్నికల కోడ్‌లోకి వచ్చాయి. ఆయా ప్రాంతాల నుంచి పలువురు నేతలు కరీంనగర్‌కు వచ్చి నామినేషన్లు వేసేందుకు రానుండగా.. ఈ మేరకు కలెక్టరేట్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేతల ఏర్పాట్లు..!

తాజాగా అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో ఆయన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల7న ఆయన నామినేషన్ వేస్తారని సమాచారం. ఈ కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారని సమాచారం. 10న నరేందర్ రెడ్డికి మద్దతుగా మరో ర్యాలీ జరగనుంది. అందులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొంటారు. మరో అభ్యర్థి ప్రసన్న హరికృష్ణతో బీఆర్ఎస్ నేతలు మంతనాలు సాగిస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన గులాబీ పార్టీలో చేరతారా? లేక స్వతంత్రంగా బరిలో ఉంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఉద్యమ నాయకులకు మొండిచేయి..!

అదే సమయంలో డా.బీ.ఎస్ రావు , మాజీ మేయర్ రవీందర్ సింగ్, ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు స్వతంత్రంగా బరిలో ఉంటారని సమాచారం. వీరిలో రవీందర్ సింగ్, శేఖర్‌రావు ఉద్యమ నాయకులు అయినా తమకు మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా ఉద్యమనేత నిజామాబాద్‌కు చెందిన రాజారాం యాదవ్‌కు కూడా ఈ విషయంలో నిరాశ మిగిలింది. ఇక బీజేపీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ అభ్యర్థి మల్క కొమురయ్య నామినేషన్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరి నామినేషన్లకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రితోపాటు మరికొందరు కీలక నేతలు హాజరుకానున్నారు. ప్రభుత్వ అధ్యాపక జేఏసీ, ఎస్టీయూ టీఎస్, టీపీఆర్టీయూలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి, సిట్టింగ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తమరెడ్డి కూడా రెండురోజుల్లో నామినేషన్ వేయనున్నారు. మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నా.. బరిలో దిగే విషయంలో సందిగ్ధం నెలకొంది. అదే విధంగా పీఆర్‌టీయూ బలపరిచిన వంగా మహేందర్‌రెడ్డి, ఎస్టీటీయూ నుంచి సంకినేని మాధవరావు కూడా బరిలో ఉన్నారు. టీపీటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన వై.అశోక్‌కుమార్ నామినేషన్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరి భవితవ్యాన్ని 3,58,614 మంది గ్రాడ్యుయేట్లు, 28,672 మంది టీచర్లు నిర్ణయించనున్నారు.


వి.నరేందర్‌రెడ్డి, (కాంగ్రెస్)


అంజిరెడ్డి (బీజేపీ)


కూర రఘోత్తమరెడ్డి


అశోక్‌కుమార్


సర్దార్ రవీందర్‌సింగ్


మల్క కొమురయ్య

నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో రూ.500 నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. తానూరు మండలం బొంద్రాత్ గ్రామానికి చెందిన షేక్ ఖాదీర్ స్థానిక మంజులాపూర్ ఆటోస్టాండ్ వద్ద కూరగాయలు విక్రయిస్తున్న దొంగరీ వంశీ వద్దకు వచ్చాడు. అతని వద్ద రూ.140 కూరగాయలను కొనుగోలు చేసి రూ.500 నోటు అందించాడు. నోటు తేడాగా కనిపించడంతో వేరేది ఇవ్వమని అడగగా అతనితో గొడవకు దిగాడు. పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై అశోక్ అక్కడికి చేరుకుని నోటును పరిశీలించగా నకిలీదని తేలింది. అతని విచారించగా తనతో పాటు బస్టాండ్ వద్ద ఉన్న మరోవ్యక్తి వద్ద కూడా నకిలీనోట్లు ఉన్నట్లు తెలిపాడు. షేక్ ఖాదీర్ వద్ద ఉన్న 40 నోట్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నాడు. మరో వ్యక్తిని విచారించగా అతని పేరు సోంకేడి సురేష్ అని తెలిపాడు. అతని వద్ద నుంచి 43 నోట్లు, ఫోన్ స్వాధీనం చేసుకున్నాడు. ఇద్దరిని విచారించగా మహారాష్ట్రలోని పర్బాని తాలూకా పోకర్ని గ్రామానికి చెందిన సందీప్ వద్ద కొనుగోలు చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ అనే అంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వెహికిల్ పరిశ్రమ కోసం భవిష్యత్ ఇంజినీర్లను రూపొందించడంలో ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఎలక్ట్రానిక్స్ వెహికిల్ చార్జర్లు, డ్రైవ్ రైళ్లు, పవర్ కన్వర్టర్, టెక్నాలజీలపై ఈ సదస్సులో వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మురళీదర్శన్, ఏవో రణధీర్‌సాగి, కోఆర్డినేటర్‌లు లక్ష్మణ్, ముత్యం, వినయ్‌కుమార్, హెచ్‌వోడీ బావుసింగ్, ఎన్.రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో ఆగని చోరీలు..!


సీసీ పుటేజీలో నమోదైన దృశ్యం

భైంసాటౌన్: భైంసా పట్టణంలో చోరీలు నిత్యకృత్యమయ్యాయి. ఆలయాలు, ఇళ్లు, దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. శనివారం రాత్రి దాటిన తర్వాత భైంసా–నిర్మల్ రహదారిలో గల ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో ఓ ఆన్‌లైన్ డెలివరీ బ్రాంచ్ కార్యాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. స్థానిక పులేనగర్‌లో ఓ ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలో పోలీసు బందోబస్తు ఉన్నా చోరీలు ఆగకపోవడం పట్టణవాసులను కలవరపాటుకు గురిచేస్తోంది.

యువకుడు బలవన్మరణం


పవన్ కళ్యాణ్(ఫైల్)

కోటపల్లి: ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల మేరకు చెన్నూర్ పట్టణంలోని మహంకాళి వాడకు చెందిన మాదాసు రాజన్న, రాజేశ్వరి దంపతుల కుమారుడు మాదాసు పవన్ కళ్యాణ్ (24) స్థానికంగా ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం కోటపల్లి మండలంలోని రాంపూర్‌లో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. కొంతసేపటికి బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన యువకుడు నోట్లో నుంచి నురగలు కక్కుతుండడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. అయితే సదరు యువకుడు ఆన్‌లైన్లో షేర్‌మార్కెట్‌లో డబ్బులు పెడుతుండేవాడని, పెద్దమొత్తంలో డబ్బులు పోగొట్టుకోవడంతోనే కలతచెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ..

లింగాపూర్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల మేరకు వంజరిగూడకు చెందిన అవినాష్ (19) చదువు మధ్యలో మానేసి రెండేళ్లుగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఏదైనా పనిచేసుకోవాలని తండ్రి హన్మంతు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. గతనెల 31న ఇంట్లోనే గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జైనూర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

శివాలయంలో చోరీ

జైపూర్: మండలంలోని పెగడపల్లిలో అతి పురాతనమైన శివాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శివాలయంలో గుర్తు తెలియని దుండగులు గుడి తాళం పగులగొట్టి శివలింగంపై ఉన్న రెండు వెండి పగడాలు, పార్వతి అమ్మవారి విగ్రహంపై ఉన్న జత బంగారు పుస్తెలు(అరతులం) అపహరించారు. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు. అర్చకులు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

అడవిలో అందమైన పక్షులు


పీడ్ కింగ్‌ఫిషర్


శిక్ర


స్కాలి బ్రీస్టెడ్ మునియా

జన్నారం అటవీ డివిజన్‌లోని బైసన్‌కుంట, మైసమ్మకుంట, ఘనిషెట్టి కుంటల ప్రాంతంలో అందమైన పక్షులు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. ఇటీవల జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించిన పక్షి ప్రేమికులు వివిధ రకాల పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. – జన్నారం

పోటెత్తిన భక్తజనం

- నాగోబా జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు


జనజాతరగా మారిన నాగోబా ప్రాంతం


క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మెస్రం వంశీయులు


నాగోబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని గత నెల 28న ప్రారంభమైన కేస్లాపూర్ నాగోబా జాతర కొనసాగుతోంది. ఆదివారం సెలవుదినం కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి నాగోబాను దర్శించుకున్నారు. మాజీమంత్రి జోగు రామన్నతో పాటు పలువురు ప్రముఖులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో జాతర పరిసర ప్రాంతం జనసంద్రంగా మారింది. అనంతరం భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద సామగ్రి కొనుగోలు చేశారు. రంగులరాట్నాలు, సర్కస్‌ల వద్ద యువతీ యువకులు, చిన్నారులు సందడి చేశారు. అధికారికంగా ఈ నెల 4వ తేదీ వరకు నాగోబా జాతర కొనసాగుతుందని ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పుజారి మెస్రం శేఖు, మెస్రం వంశం ఉద్యోగులు దేవ్‌రావ్, శేఖర్‌బాబు, సోనేరావ్, మెస్రం వంశీయులు దేవ్‌రావ్, నాగ్‌నాథ్, తుకారాం , ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

జాతరలో భాగంగా నాగోబా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లకు ఆదివారం మెస్రం వంశీయుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి ఇచ్చోడ మండలంలోని బురదపల్లి జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతి ఇంద్రవెల్లి మండలంలోని దొడంద జట్టుకు రూ.10 వేలు, తృతీయ బహుమతి ఆదిలాబాద్ మండలంలోని దావెన్‌గూడ జట్టుకు రూ.5 వేలు అందజేశారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి మంచిర్యాల జిల్లా దేవాపూర్ జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతి ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ జట్టుకు రూ.10 వేలు, తృతీయ బహుమతి ఇంద్రవెల్లి మండలంలోని మల్లాపూర్ జట్టుకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావ్, మెస్రం వంశ పెద్దలు మెస్రం మనోహర్, మెస్రం కోసేరావ్, మెస్రం నాగ్‌నాథ్, నాగోబా యూత్ అధ్యక్షుడు రాము, సభ్యులు పాల్గొన్నారు.

పులి రాక కోసం..

- జిల్లాలో బెబ్బులి సంచారంతో అటవీ అధికారులు అప్రమత్తం
- టైగర్‌జోన్ పరిధిలో ఆటంకాలు లేకుండా తనిఖీలు


భర్తన్‌పేట్ బీట్‌లో పరిశీలిస్తున్న రేంజ్ అధికారి, సిబ్బంది

జన్నారం: పులి రాకకోసం అటవీశాఖ అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల బెల్లంపల్లి, వేమనపల్లి, తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి జన్నారం అటవీ డివిజన్‌లోనే ఆవాసం ఏర్పర్చుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగేళ్లుగా రాకపోకలతోనే సరిపెడుతున్న పులి ఇక్కడే ఉండేలా తగు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్‌లోని అటవీ రేంజ్‌లో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతున్నారు. 2024 సెప్టెంబర్‌లో పైడిపెల్లికి చెందిన ఓ రైతు ఆవులపై దాడి చేసిన పులి అప్పటి నుంచి ఇందన్‌పల్లి, జన్నారం అటవీ రేంజ్‌లలో పర్యటించినట్లు కెమెరాకు చిక్కింది. అక్కడి నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎప్పటికైనా ఈ ప్రాంతంలో ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అలజడి లేకుండా

20 డిజిబుల్ శబ్దం వచ్చినా పులికి వినిపిస్తుందని, అందుకే అలజడి ఉన్నచోట పులి ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జన్నారం అటవీ డివిజన్‌లోని పలు అటవీ బీట్‌లలో పశువులు, మనుషుల సంచారం లేకుండా చర్యలు చేపడుతున్నారు. పులి సంచరించే ట్రాక్‌లో ఎలాంటి శబ్దం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. టైగర్ మానిటరింగ్ చేస్తూ ట్రాక్‌ను క్లియర్ చేస్తున్నారు.

ఇందన్‌పల్లి రేంజ్‌లో పరిశీలన

ఫారెస్ట్ మార్చ్‌లో భాగంగా అధికారులు రేంజ్ పరిధిలోని అటవీ బీట్‌లలో పర్యటిస్తూ ఉచ్చులు, కరెంటు తీగలు, వలలు, తదితర ప్రాణాంతక పరికరాలు తనిఖీ చేస్తున్నారు. అలాంటివి ఉంటే ముందుగా తొలగిస్తూ అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జన్నారం బీట్‌లో ఉచ్చులు అమర్చిన ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేశారు. ఎప్పటికప్పుడు టైగర్ ట్రాక్‌ను పరిశీలిస్తూ పులి ఆవాసం ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.


15 కిలోమీటర్లు కాలినడకన..

ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో ఫారెస్ట్ మార్చ్ నిర్వహించి సిబ్బందితో కలిసి 15 కిలోమీటర్లు కాలినడకన టైగర్‌ట్రాక్ పరిశీలించినట్లు రేంజ్ అధికారి తెలిపారు. కల్పకుంట నుంచి మొదలు కవ్వాల్ అటవీ సెక్షన్‌లోని రాగికుంట వరకు వాగులు, దారులు పరిశీలించి అవాంతరాలు లేకుండా చూసినట్లు అధికారులు తెలిపారు.

తచ్చాడుతున్న పులి..

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు కన్నాల అటవీ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి పులి సాహసించడం లేదు. పెద్ద బుగ్గ, చిన్న బుగ్గ మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో తిష్టవేసి విరామం లేకుండా సంచారం చేస్తోంది. అటవీ ప్రాంతాన్నీ అణువణువు తిరుగుతోంది. మరో ప్రాంతానికి వెళ్లడానికి అయిష్టత చూపుతోంది. చిన్నబుగ్గ అటవీప్రాంతం నుంచి నీలగిరి తోటవైపు నుంచి బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని దాటి గోండు గూడెం వైపు కొంతదూరం అడుగులు వేయడం, వెనక్కి రావడం చేస్తోంది. దీంతో బుగ్గ దేవాలయానికి వెళ్లే మార్గాన్ని అటవీ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎనిమల్ ట్రాకింగ్ సిబ్బంది కన్నాల గ్రామానికి వెళ్లే చౌరస్తా వద్ద మాటువేసి రాకపోకలు సాగకుండా చెట్ల కొమ్మలు నరికి అడ్డంగా పెట్టారు. ముఖ్యమైన ఐదు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా పులి వాటికి చిక్కడంలేదు. అల్లంత దూరం నుంచి వెళ్తున్నట్లు తాజాగా అటవీశాఖ అధికారులు గుర్తించారు. బెల్లంపల్లి అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్ పర్యవేక్షణలో పహారా కాస్తున్నారు.

ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం



మానిటరింగ్‌లో భాగంగా పులి తిరిగే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వారంలో ఒక రోజు నిర్వహించే ఫారెస్ట్ మార్చ్‌లో భాగంగా సిబ్బందితో కలిసి అడవిలో పర్యటిస్తున్నాం. పులి ఆవాస ప్రాంతాలలో ప్రమాదకరమైన పరికరాలు లేకుండా చూస్తున్నాం. ముందు జాగ్రత్తలో భాగంగానే ట్రాక్‌ను పరిశీలిస్తున్నాం.

– కారం శ్రీనివాస్, అటవీ రేంజ్ అధికారి